క్లుప్తంగా

బడి వేళలకు అనుగుణంగా నూతన బస్సు సర్వీస్

ద్వారకాతిరుమల: విద్యార్థుల సౌకర్యార్థం బడి వేళలకు అనుగుణంగా జంగారెడ్డిగూడెంకు చెందిన ఆర్టీసీ డిపో ద్వారకాతిరుమల నుంచి జంగారెడ్డిగూడెంకు నూతన బస్సు సర్వీసును గురువారం ప్రారంభించింది. ఈ బస్సు ఉదయం ద్వారకాతిరుమలలో ప్రారంభమై జి.కొత్తపల్లి, ఐఎస్ రాఘవాపురం, గొల్లగూడెం , లక్ష్మీపురం, నిమ్మలగూడెం మీదుగా జంగారెడ్డిగూడెంకు చేరుకుంటుంది. తిరిగి సాయంత్రం ఈ బస్సు జంగారెడ్డిగూడెంలో ప్రారంభమై ఇదే రూటు మీదుగా ద్వారకాతిరుమలకు వెళుతుంది. జి.కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ఈ నూతన బస్సు సర్వీసును ఏర్పాటు చేశారు. దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ పి.వెంకట గంగాధరరావు కోరారు.

రేపు రేబిస్ వ్యాధి నిరోధక టీకాల అందజేత

జంగారెడ్డిగూడెం: స్థానిక ప్రాంతీయ పశువైద్యశాల నందు ప్రపంచ సంక్రమిత వ్యాధుల దినోత్సవం శనివారం నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు పీఎస్‌వీ శేఖర్ దొర తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉచితంగా రేబిస్ వ్యాధి టీకాలు వేయడం జరుగుతుందన్నారు. అనంతరం జునోసిస్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున జంగారెడ్డిగూడెం పట్టణ, పరిసర గ్రామ ప్రజలు వారి పశువులకు, పెంపుడు జంతువులకు ముఖ్యంగా కుక్కల యజమానులు వారి కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు.

శివయ్యకు రుద్రాభిషేకం


శివయ్యకు రుద్రాభిషేకాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం శివదేవునికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. ముందుగా దేవస్థానం సిబ్బంది ఆలయాన్ని సుగంధభరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణల నడుమ గర్భాలయంలో కొలువైన శివదేవునికి అభిషేకాన్ని నేత్రపర్వంగా జరిపారు. రాత్రి గంగా, పార్వతీ సమేత శివదేవుడికి నంది వాహనంపై గ్రామోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు.

వంగవీటి రంగా విగ్రహావిష్కరణ


విగ్రహావిష్కరణలో పాల్గొన్న వంగవీటి రాధాకృష్ణ, ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్

కామవరపుకోట: వంగవీటి రంగా బడుగు బలహీన వర్గాలకు చేసిన సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. వంగవీటి రంగా జయంతి సందర్భంగా తడికలపూడిలో గ్రామంలో ఏర్పాటు చేసిన రంగా కాంస్య విగ్రహాన్ని రంగా తనయుడు వంగవీటి రాధాకృష్ణ, ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన్ రంగా అని అన్నారు. కార్యక్రమంలో చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి రామకృష్ణ, జనసేన నాయకులు కరాటం రాంబాబు, టీడీపీ మండల కన్వీనర్ కిలారి సత్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు, మాజీ జెడ్పీటీసీ ఘంటా సుధీర్, మద్దిపోటి నాగేశ్వరరావు, వేముల నాగేశ్వరరావు, కంఠమనేని అంజిమూర్తి, కొయ్యగోర వెంకటేష్, పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా సాధనకు కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న గురవయ్య

చింతలపూడి: రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం కూటమి నేతలు ప్రయత్నించాలని సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య అన్నారు. రేచర్ల గ్రామ శాఖ సమావేశం దొంత తిరుపతయ్య అధ్యక్షతన జరిగింది. గురవయ్య మాట్లాడుతూ ఎన్డీఏ కూటమిలో భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జనసేన ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికై రాష్ట్రానికి ప్రత్యేక హోదా, అమరావతి, పోలవరం నిర్మాణానికి నిధులు తీసుకురావడానికి ప్రయత్నించాలన్నారు. రేచర్ల గ్రామంలో ప్రధాన రహదారులను అభివృద్ధి పరచాలని, గ్రామంలో ఉన్న శ్మశానవాటికకు రెవెన్యూ లెక్కల్లో ఎక్కించేందుకు సంతకాల సేకరణ చేసి అధికారులకు అందజేయాలని తీర్మానించినట్లు తెలిపారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దంతా కృష్ణ, మండల సహాయ కార్యదర్శి తోర్లపాటి బాబు, గ్రామ కార్యదర్శి ఇ.వెంకటేశ్వరరావు, పి.చెంచయ్య, గుండ్ల శివ పాల్గొన్నారు.

అల్లూరి పోరాట స్ఫూర్తి ఆదర్శప్రాయం

- ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి
- మన్యం వీరుడికి వాడవాడలా ఘన నివాళి


బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏలో అల్లూరికి నివాళి అర్పిస్తున్న పీఓ సూర్యతేజ


చింతలపూడి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్లూరికి నివాళులర్పిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: అల్లూరి సీతారామరాజు గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు అని కేఆర్‌పురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా గురువారం కేఆర్‌పురం ఐటీడీఏలో మన్యం వీరుడు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పీవో సూర్యతేజ మాట్లాడుతూ తెల్ల దొరల శ్రమ, దోపిడీ, అన్యాయాన్ని ఎదిరించి అల్లూరి సీతారామరాజు పోరాడారని, గిరిజనుల్లో, దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో పోరాట స్ఫూర్తిని రగిలించిన విప్లవ యోధుడని కొనియాడారు. ఏపీఓ పీవీఎస్ నాయుడు, మేనేజర్ ప్రకాష్, డీవైఈఓ కె. నీలయ్య, ఏఎంఓ కె.శిరమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి జయంతి వేడుకలు

చింతలపూడి: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రజాసంఘాల కార్యాలయం వద్ద ఎం వరలక్ష్మీదేవి అధ్యక్షతన అల్లూరి చిత్రపటానికి పలువురు ప్రజా సంఘాల నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న అల్లూరి విగ్రహానికి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అల్లూరి స్ఫూర్తితో కులమతాలకు అతీతంగా దేశాన్ని ముందుకు నడిపించాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా పి శ్రీనివాసరావు, అధ్యాపకులు అల్లూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర్య పోరాటంలో చేసిన సేవలను గురించి విద్యార్థులకు వివరించారు.

అల్లూరి ఆశయాలను కొనసాగించాలి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. యూకేఎస్ఎస్ జంగారెడ్డిగూడెం కార్యదర్శి నంబూరి రామచంద్రరాజు అధ్యక్షతన స్థానిక ఏఎస్ఆర్ మున్సిపల్ పార్క్, అశ్వారావుపేట రోడ్డు, ఏలూరు రోడ్డులో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎఫ్‌కేఎస్ఎస్ డైరెక్టర్ మంతెన సోమరాజు హాజరు కాగా, పేద క్షత్రియ వృద్ధులకు నెలవారీ పింఛన్‌లు అందజేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా అల్లూరి ఎనలేని కీర్తిని సాధించారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడం ప్రతి ఒక్కరి కర్తవ్యం అని పేర్కొన్నారు.

అల్లూరి త్యాగం చిరస్మరణీయం

కామవరపుకోట: ఆడమిల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి ఘనంగా నిర్వహించారు. కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు అధ్యక్షతన అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా సాయుధ తిరుగుబాటు చేసిన గొప్ప విప్లవకారుడు అల్లూరు సీతారామరాజు అని, ఆయన దేశానికి చేసిన త్యాగాన్ని గుర్తు చేశారు.

అల్లూరి సేవలు ఎనలేనివి

ద్వారకాతిరుమల: పంగిడిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 127 వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు మస్తాన్ బీబీ అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు పండిట్ డాక్టర్ మద్దాల పెద్దిరాజు అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రను వివరించారు. బ్రిటీష్ సామ్రాజ్యాన్ని సీతారామరాజు గడగడలాడించారని, స్వాతంత్రోద్యమంలో ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. అనంతరం ఆయన రాసిన వ్యాస సంకలనం పుస్తకాన్ని పెద్దిరాజు పాఠశాల గ్రంథాలయానికి బహుమతిగా అందించారు.

మన్యం పులి.. అల్లూరి

కొయ్యలగూడెం: విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు అల్లూరి ఘన చరిత్రను వివరించారు. బ్రిటీష్ కాలంలో ఏజెన్సీగ్రామాల్లో గిరిజనులపై జరుగుతున్న అత్యాచారాలు, అన్యాయాలపై పోరాడిన వ్యక్తి అల్లూరి సీతారామరాజు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా బ్రిటీష్ వారిని ఎదిరించి పేదల పక్షాన నిలిచిన అమరవీరుడు మన్యం పులి అల్లూరి సీతారామరాజు అని పేర్కొన్నారు. ఆయన నడిచిన బాట నేటికి ఆదర్శనీయం అని, ప్రతీ ఒక్కరూ అల్లూరి ఆశయ సాధన కోసం కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు తాడిగడప ఆంజనేయరాజు, సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాస్, ఏపీ బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి వెలగల దుర్గారావు, ఇళ్ల నరసయ్య, గిరి నాని తదితరులు పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెం: ఏఎస్ఆర్ పార్క్‌లో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం


కామవరపుకోట: అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు


ద్వారకాతిరుమల: పంగిడిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అల్లూరి జయంతి వేడుకల్లో నిర్వహిస్తున్న దృశ్యం


కొయ్యలగూడెం: అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ఘనంగా వంగవీటి రంగా జయంతి


చింతలపూడిలో రంగా జయంతి వేడుకల్లో పాల్గొని ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్


జంగారెడ్డిగూడెంలో వంగవీటి మోహన్‌రంగా జయంతి సందర్భంగా కేక్‌ను కట్ చేస్తున్న జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి తదితరులు


కొయ్యలగూడెంలోని వంగవీటి రంగా విగ్రహం వద్ద జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి: వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలను వంగవీటి రంగా విగ్రహ నిర్మాణ, అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్‌లో ఉన్న రంగా విగ్రహానికి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, కాపు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికుల ఉన్నతికి రంగా ఎంతో శ్రమించారని అన్నారు. రంగా ఆశయాలతో యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం పాత బస్టాండ్ సెంటర్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రంగా విగ్రహ నిర్మాణ, అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు కె శేషగిరిరావు, అధ్యక్షుడు తోట శివనాగరాజు, ఉపాధ్యక్షుడు తూము విజయకుమార్, కార్యదర్శి ముత్యాల శ్రీనివాస్, రాఘవేంద్రరావు, కె శ్రీనివాస్, సూరానేని గోపీనాథ్, చిట్లూరి ధర్మరాజు, బోడ అనీష్, చీదరాల మధుబాబు, గంధం చంటి, రావిపాటి రామారావు, పూర్ణచంద్రరావు, కురిశెట్టి శ్రీను, శింగంశెట్టి శివకుమార్, గుమ్మిశెట్టి భారతి తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్షం ఆధ్వర్యంలో...

కొయ్యలగూడెం: కృష్ణా జిల్లాకు వంగవీటి మోహన్ రంగా పేరు పెట్టి ప్రభుత్వం ప్రజల డిమాండ్‌ను నెరవేర్చాలని అఖిలపక్ష రాజకీయ పార్టీ నాయకులు గురువారం పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెం రోడ్డులోని ఆంధ్రా బ్యాంక్ ఎదుట ఉన్న వంగవీటి రంగా విగ్రహం వద్ద ఆయన 77వ జయంతి కార్యక్రమం అఖిలపక్ష రాజకీయ పార్టీ నాయకుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. కన్నాపురం, దిప్పకాయలపాడు, బయ్యనగూడెం, రామానుజపురం, అచ్యుతాపురం గ్రామాల్లో వంగవీటి రంగా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి సేవా కార్యక్రమాలు చేపట్టారు.

అన్ని వర్గాల ఆశాజ్యోతి వంగవీటి

జంగారెడ్డిగూడెం: అన్ని వర్గాల ప్రజల ఆశాజ్యోతి వంగవీటి మోహన రంగా అని జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి అన్నారు. జంగారెడ్డిగూడెంలో వంగవీటి మోహన రంగా జయంతి వేడుకలు రాధారంగా మిత్రమండలి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. మిత్రమండలి అధ్యక్షుడు బాదరాల నరేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, మిత్రమండలి సభ్యులు కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ వంగవీటి రంగా కుల మతాలకు అతీతంగా బడుగు బలహీన ప్రజలకు వెన్నుదన్నుగా నిలిచిన వ్యక్తి అన్నారు. రంగా ఆశయాలను కొనసాగిస్తామంటూ అభిమానులతో కలిసి ప్రతిజ్ఞ పాటించారు. ఈసందర్భంగా రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రావూరి కృష్ణ, వలవల తాతాజీ, మద్దాల ప్రసాద్, సంకు ప్రభాకర్, దాకారపు కృష్ణ, అల్లూరి రామకృష్ణ, మారిశెట్టి బాలచిట్టెమ్మ, కాపు సంఘాల నాయకులు , ప్రతినిదులు పాల్గొన్నారు.

కుక్కునూరు: బడుగు, బలహీన వర్గాలకు అన్ని విధాల అండగా ఉండి వారి అభ్యున్నతి కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తిత్వం వంగవీటి రంగా సొంతమని కాపు సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. గురువారం కుక్కునూరు ప్రధాన సెంటర్‌లో రంగా జయంతి వేడుకలు కాపు సంక్షేమ సేవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. రంగా బడుగు, బలహీన వర్గాల కోసం చేసిన పోరాటాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో కాపు సంక్షేమ సేవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా విద్యార్థి సంఘాల బంద్

జంగారెడ్డిగూడెం: ఐక్య విద్యార్థి సంఘాల పిలుపులో భాగంగా గురువారం జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ ప్రశాతంగా జరిగింది. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బంద్‌కు సహకరించిన అన్ని యాజమాన్యాల విద్యాసంస్థలకు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్ కృతజ్ఞతలు తెలిపారు. మండల కార్యదర్శి ఎం వెంకట్రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సూర్యకిరణ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జాతీయస్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందన్నారు. తీవ్రమైన అవకతవకలు వ్యత్యాసాలతో, బాధ్యతారాహిత్యంతో పరీక్షలు నిర్వహించారని, నీట్ పరీక్షలు లీకేజీ తెర వెనక కుంభకోణం పీజీ, పరీక్షలను 12 గంటల ముందు వాయిదా వేయడం యూజీసీ నీట్ పరీక్షలు రద్దు చేయడం వంటివి విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన కలిగించిందని పేర్కొన్నారు. నీట్ స్కాంపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా బాధ్యతతో సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలన్నారు. కార్యక్రమంలో పూర్వ జిల్లా కార్యదర్శి పి సూర్యరావు, పీడీఎస్‌యూ వినోద్, జిల్లా కమిటీ సభ్యులు ఎన్ రాజేష్, పి పోతురాజు, ఆశీర్వాదం, వెంకటేశ్వరరావు, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు. తొలుత అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాలను వేసి ఘన నివాళి అర్పించారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించండి

చింతలపూడి: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికి ఆర్టీసీ అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆదేశించారు. చింతలపూడి క్యాంప్ కార్యాలయంలో జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర్‌తో గురువారం ఆయన రవాణా సౌకర్యాలపై సమీక్షించారు. అధికారులు ఆదాయంతో పాటే ప్రయాణికులకు సదుపాయాలు కల్పించాలని, అవసరమైన రూట్లలో బస్సులు నడపాలని చెప్పారు. జంగారెడ్డిగూడెం డిపో నుంచి చింతలపూడి మీదుగా విజయవాడకు బస్సు సర్వీసు నడపాలని ఆదేశించారు. సమీక్షలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎన్‌వీ దుర్గారావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు

చింతలపూడి పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అధికారులను ఆదేశించారు. పట్టణంలో మెయిన్ రోడ్డులో ఉన్న దుకాణాదారులు కూడా సహకరించాలని, ఫుట్ పాత్‌లపైకి వచ్చిన కట్టడాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కోరారు. ప్రమాదాల నివారణకు వ్యాపారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కాంటూర్ లెక్కలతో సంబంధం లేకుండా పరిహారం అందించాలి


ఆర్అండ్ఆర్ కాలనీలో నిర్వాసితులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

కుక్కునూరు: కాంటూర్ లెక్కలతో సంబంధం లేకుండా మండలం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకొని పోలవరం నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని రైతు సంఘం, కౌలు రైతు సంఘం రాష్ట్ర నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రైతు సంఘం నాయకులు మండలంలోని కివ్వాక, మద్రిపాడు, ఆర్అండ్ఆర్ కాలనీలను సందర్శించి నిర్వాసితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి క్రిష్ణయ్య, ఉపాధ్యక్షుడు ఎం సూర్యనారాయణ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ కోసం సర్వం త్యాగం చేసి నిరాశ్రయులవుతున్న నిర్వాసితులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. అసలు కాంటూర్ లెక్కలకు ముంపునకు పూర్తిగా సంబంధం లేదని 2022 గోదావరి వరదలు తేల్చిచెప్పాయన్నారు. కాని ప్రభుత్వాలు మాత్రం ఆ సర్వేలు, ఈ సర్వేలు అంటూ కాలయాపన చేస్తున్నాయని దుయ్యబట్టారు. నిర్వాసిత సమస్యలన్నిటిపైనా ఈనెల 10వ తేదీన కేంద్ర మంత్రులను ఢిల్లీలో కలిసి వివరించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ రవి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు రాణి, ఏలూరు జిల్లా కార్యదర్శి పిల్లి రామక్రిష్ణ, రైతు సంఘం నాయకులు నరసింహారావు, సీపీఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు, సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్, గిరిజన సంఘం మండల కార్యదర్శి పట్ల లక్ష్మయ్య, రైతు సంఘం నాయకులు ఎండీ పుల్లు, నిర్వాసితులు పాల్గొన్నారు.

గోదావరి వరదను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

- పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు
- వేలేరుపాడు ఐకేపీ కార్యాలయంలో అధికారులతో సమీక్ష


వేలేరుపాడు ఐకేపీ కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఆర్డీఓ అద్దయ్య

వేలేరుపాడు: గోదావరి వరదను ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పేర్కొన్నారు. గురువారం వేలేరుపాడు ఐకేపీ కార్యాలయంలో వరదపై అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోవు గోదావరి వరదను దృష్టిలో ఉంచుకొని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో రెవెన్యూ అధికారులు ముందు జాగ్రత్తగా గ్రామాలు ఖాళీచేయించేందుకు అప్రమత్తంగా ఉండాలన్నారు. భద్రాచలం వద్ద మొదటి, రెండో, మూడో ప్రమాద హెచ్చరికల ఆధారంగా వరద ప్రభావిత గ్రామాల్లో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వరద బాధితుల కోసం వేలేరుపాడు, కుక్కునూరు, జంగారెడ్డిగూడెం తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి, టోల్ ఫ్రీ నంబర్‌లు ఇవ్వాలని ఆదేశించారు. రెండు మండలాల్లో బఫర్ స్టాక్ మూడునెలలు సరిపడా నిత్యావసర వస్తువులు ఆయా ప్రాంతాల్లో సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రతి గ్రామంలో వీఆర్ఏ, వీఆర్‌ఓలు సచివాలయ సిబ్బంది, అందుబాటులో ఉండాలని ఆదేశించారు. గ్రామాల్లో శానిటేషన్ పనులు వెంటనే చేపట్టేలా ప్రణాళిక తయారు చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. విద్యుత్ సరఫరా నిలిపివేసే గ్రామాల్లో ముందు జాగ్రత్తగా విద్యుత్ జనరేటర్‌లు సిద్ధంగా ఉంచాలన్నారు. గోదావరి వరద నీటి మునిగిన రహదారుల వద్ద కల్వర్టులు పాడైపోతే తక్షణం ప్రయాణ సదుపాయాలు కల్పించేందుకు ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా వేలేరుపాడు, కుక్కునూరు వైద్యాధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌ఓ సురేష్‌ను సూచించారు. రెండు మండలాల్లో సరిపడా లాంచీలు, దేశీయ పడవలు సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కె అద్దయ్య, ఆర్‌టీఏ, ఎండీ మదానీ, డీఎల్‌పీఓ రజీవుల్లా, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు సీహెచ్ హరికృష్ణ, ఎస్ సీతయ్య వేలేరుపాడు డిప్యూటీ తహసీల్దార్ రమేష్, ఎంపీడీఓ శ్రీహరి, ఐసీడీఎస్ సీడీపీఓ, ,ఎస్ లక్ష్మీకుమారి, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, ఎంపీపీ వాళ్ళ లక్ష్మీదేవి, జనసేన మండల అధ్యక్షుడు గణేశుల ఆదినారాయణ, సంజయ్, దేవిరెడ్డి సుధాకర్, సీపీఐ మండల అధ్యక్షుడు బాడిశ రాము, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గోదావరి వరదలపై అప్రమత్తంగా ఉండాలి

కుక్కునూరు: గోదావరి వరదలను ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని కుక్కునూరు తహసీల్దార్ పి అచ్యుతాకుమారి సూచించారు. గురువారం గోదావరి వరదలపై ఆమె స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో శానిటేషన్ కార్యక్రమాలను నిర్వహించే దిశగా బ్లీచింగ్ పౌడర్‌ను సిద్ధంగా ఉంచాలని ఎంపీడీఓకు సూచించారు. మెడికల్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కాగా డిపార్ట్‌మెంట్ తరుపున సిబ్బంది కొరత ఉందని, మండలానికి మరో 108 వెహికిల్‌ను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు.